పలకని స్వరాలు

అనుపమాదేవి

గేటు యథాప్రకారం మూసి రోడ్డుపైకి వచ్చి ఒక్క క్షణం ఆలోచనలో నిమగ్నయై, పోదల్చుకున్న దిక్కునకభిముఖంగా బయల్దేరింది నిరుపమ. వైశాఖమాసం వచ్చింది. సాయంత్రం ఆరు గంటలైనా ఎండ వేడిమి తగ్గలేదు. వడగాడ్పు కూడా మొదలైంది. స్నేహితురాలింటికి వెళ్ళి ఆమెను తీసుకుని సినిమాకు వెళ్తానని చెప్పింది తండ్రితో. కానీ బయటకు వచ్చేసరికి ఆ ఆలోచనలకు స్వస్తి చెప్పి చీకటిపడేవరకూ నిర్మానుష్యంగా ఉండే ఆ రోడ్డుపైన్నే కొంతదూరం వెళ్ళి రావాలనుకుంది. ఈ రోజున సినిమాక్కు వెళ్ళాలనిగానీ, స్నేహితులతో మాట్లాడాలనిగాని లేదామెకు. అంతకంటే ముఖ్యమైన తన భవిష్యత్తు వైపు సాగిన్నై ఆలోచన్లు. ఈ రోజువరకూ తనకై తాను స్వవిషయం ఆలోచించి ఎరుగదు. కానీ ఇటీవలే ఏవో దుష్టగ్రహాలు తన జాతకంలోనో, తన తండ్రి జాతకంలోనో ప్రవేశించిన్నై. "కాకపోతే నిన్న సాయంత్రం నాన్న చెప్పిందేమిటి మరి!" పది నిమిషాలు గడిచేసరికి గాడ్పు పూర్తిగా తగ్గింది. అసరికి ఆమె గమ్యస్థానం సమీపించింది. రెండు రోడ్లు చీలేచోట ఒక నిమిషంపాటు నిల్చుని దగ్గరలో కన్పించే మామిడితోపువైపు నడిచింది.

అక్కడికివెళ్తే, నిర్భయంగా మరికొంతసేపు కూర్చో వచ్చనుకుంది.

ఇకముందు జరుగవలసిందాన్ని ఆలోచించుకోవాలి. నిన్న సాయంత్రం తండ్రీ కూతుళ్ల మధ్యన జరిగిన కొద్దిపాటి సంభాషణే ఇందుక్కారణం. ఆట్టే ఉపోద్ఘాతం లేకుండానే ఒక్కసారిగా గుండెలదిరిపోయేవార్త చెవున వేశాడు తండ్రి. ఆయన తనకు గుండెజబ్బున్నదనీ, ఏ క్షణాన్నైనా చనిపోవచ్చనీ' చెప్పకపోయినట్టయితే బహుశా ఇంకా చాలా కాలంవరకూ నిరుపమ నిశ్చింతగా ఉండగలిగేదే. ఈ సంగతి తండ్రి ఇంతవరకూ చెప్పి ఉండలేదు. ఇప్పుడు చెప్పక తప్పదని చెప్పాడు. నిన్న సాయంత్రంనుంచీ నిరుపమకు నిద్రాహారాలు లేవు

క్రితంరోజు సాయంత్రం డిస్పెన్సరీ చేరుకుని తండ్రి విశ్రాంతి తీసుకునే గదిలోకి అడుగు పెట్టేసరికి బయట చీకటి పడుతోంది. గదిలో పడక కుర్చీలో ఆయన ఒంటరిగా ఆలోచనల్లో మునిగిపోయి కూర్చున్నాడు. నిరుపమ లోపలికి వచ్చిన సవ్వడి ఆయన చెవులవరకూ వెళ్లనేలేదు. అందుకని తండ్రిని లేపేవంతు తనపైనే వేసుకున్న దామె. కుర్చీలోంచి లేచి కిటికీ దగ్గరగా వెళ్ళి నిల్చుని మౌనంగా బయటకు చూడసాగాడు చుట్టుప్రక్కల వీధి దీపాల వెల్తురులో పిల్లవాండ్లు ఆడుకోవటమూ—అక్కడక్కడ త్రప్ప తాగినవాళ్ళు అరుస్తూ తిట్టుకోవటమూ కన్పిస్తాయి అక్కడినుంచి. దూరాన రైలుబండి పోవటమూ కన్పిస్తుంది. మనుష్యులు గుంపులు గుంపులుగా టవున్నుంచి ఇండ్లకు చేరుకుంటున్నారు పెద్ద పెద్ద కేకల్తో వెకిలి నవ్వుల్తోనూ. ఇంత సందడీ బహుశా ఆయన ఆలకించే ధోరణిలో ఉన్నట్టు లేడు. ఆయన గాంభీర్యం, మౌనం ఇన్నేళ్ళుగా ఎరిగినదై ఉండీ కూడా నిన్నటిరోజున ఎందుకో భయపడింది నిరుపమ. ఎటూ తోచక తనూ తండ్రి ప్రక్కగావెళ్ళి బయటకుచూస్తూ నిల్చుంది. రోడ్డుపైన యువకు డొకడు ఈలపాట పాడుకుంటూ జోరుగా సాగిపోతున్నాడు. మరికొంతసేపటికి ఓ భిచ్చగాడు వాడిబిడ్డ ఆసరాగా సంధ్యా కబళం ఆడుక్కుంటూ కన్పించా డామెకు. తండ్రి చేతిని తన చేతిలోనికి తీసుకుని మొహంలోకి చూస్తూ 'నాన్నా' అని పిల్చింది. డాక్టరు శ్రీనివాసరావు కండ్లలోని నీరు జలజలా ప్రవహించింది. కూతురు కలవర పడింది. జీవితంలో మొదటిసారిగా ఆయన కన్నీరు కార్చాడు. ఈ ఆకస్మిక ప్రవర్తనకు బెంబేలుపడి ఏడుస్తూ తండ్రిని మళ్ళీ పిల్చింది. ఈసారి పిలుపు గుండెను చీల్చే పిలుపు. మరికొంతసేపటివరకూ తండ్రీ కూతుళ్ళు ఇద్దరూ నిశ్శబ్దంగా రోదించారు. అప్పటికిగానీ ఆయనకు మాట పెకల్లేదు. అప్పుడే చెప్పాడు. లోకంలో ఆమెకు ఒక్కగానొక్క అండ కూడా కొద్దికాలంలో లేకుండా పోవచ్చని. ఎంత నమ్మకూడదనుకున్నా బ్రహ్మరాక్షసిలా తరుముకుని వస్తూనే ఉందా ఆలోచన.

......గంభీరత, ప్రశాంతత అప్పటి కప్పుడే మళ్లీ ఆయనలో ప్రవేశించినై. చాలా తాపీగానూ సహజ ధోరణిలో మాట్లాడాడు.

"చాలా రోజుల్నుంచీ హృద్రోగంతో బాధ పడుతూనే ఉన్నాను. కానీ ఇప్పటివరకూ నీతో నే చెప్పే అవకాశంగానీ, అవసరంగానీ లేకపోయింది. మొన్నీమధ్య హైద్రాబాదు వెళ్లినప్పుడు నా స్నేహితుడు నన్ను బాగా పరీక్షించి ఈ విషయం నీతో చెప్పే సమయం వచ్చిందన్నాడు. అప్పటికీ చెప్పేవాణ్ణేకాదు. నిన్ను ఈ క్షణంనుంచే బాధ పెట్టడం నా కిష్టంలేదు. అయినా ఆడబిడ్డవైనా, మొగబిడ్డవైనా నువ్వే కాబట్టి ఇంటి వ్యవహారాలు చూచుకునేందుకు చెప్తున్నానమ్మా"—అని బరువు దింపుకున్నవాడిలా నిట్టూర్పు వదిలాడు. అప్పటికే దిగాలు పడివున్న నిరుపమ తండ్రి ఈ మాట అనేసరికి అంతు తెలీని అగాధాల్లోకి విసరి వేయబడుతున్నదానిలా భయపడింది. శరీరమంతటా చిరు చెమటలుపోసి ఒంట్లో వణుకు మొదలైంది.

జన్మతః జీర్ణించుకున్న గంభీరత, నిశ్చలతతో కూడా శ్రీనివాసరావు తన కూతురు పరిస్థితి గ్రహించేసరికి మళ్లీ దుఃఖం పొర్లుకొచ్చింది. దాన్ని దిగమింగి గొంతును సవరించుకుని మాట్లాడ సాగాడు.

'.... అయినా ఫరవాలేదమ్మా— ఈ జాతి అంతా ఇంతే. ఉన్న రోగానికి మందైతే సరిగా కనుక్కోరు గానీ ఇలాంటి సలహాలు మాత్రం యిస్తుంటారు. ఏమైనా ఈవిధమైన జబ్బుతో బాధపడేవాళ్ళు త్వరగా చావరులే. అంతేగాక విచిత్రం చుశావా—ఎక్కువ రోజులు బ్రతక దల్చుకుంటే జీవితపు ఉత్తరార్ధంలో హృద్రోగాన్ని కోరి తెచ్చుకోవాలమ్మా"—అని నవ్వ ప్రయత్నించాడు. ప్రాణం లేని చిరునవ్వొకటి మొహంపై మెదిలింది.

ఈమాటలంటున్నప్పుడు తన చేతుల్తో లాలనగా కూతురు తల నిమురా లనుకున్నాడు. కానీ ఏనాడూ అలవాటులేని పని ఈనాడూ చేయనిచ్చింది కాదు ఆయనలో ఉన్న జడత్వం. పితృవాత్సల్యపు చిహ్నాలు ఏనాడూ ఆయన మాటల్లోగానీ చేతల్లో గానీ కనబర్చలేకపోయాడు. ఆ దుష్టశక్తే ఈరోజున యీ దుర్ముహూర్తానకూడా తనరక్తం పంచుకుని పుట్టిన బిడ్డపైన కరుణాత్మకమైన చల్లదనాన్నీ, ఆపేక్షనూ బయల్పడ నిచ్చింది కాదు !

అక్కడి నుంచి సరాసరి బయటకు వచ్చి కార్లో కూర్చున్నాడు. మరికొంతసేపటికి నిరుపమలో చైతన్యం వచ్చింది. మెల్లగా బయటకు నడిచి ఎదురుగా కార్లో తండ్రిని చూచి తనూ కారెక్కి కూర్చుంది. చాలాసేపటివరకు గానీ డ్రైవరు వచ్చి కారును బయల్దేరనీయడం ఆ యిద్దరిలో బహుశా ఎవరూ ఎరుగరు.

నిన్న సాయంత్రపు ఈ సంఘటన నిరుపమ మనసులో మెదిలింది. ఆసరికి ఆమె మామిడి తోపులో ప్రవేశించింది. తోట కాపలావాడు ఆమె దగ్గరగా వచ్చి యజమానురాలుకు సగౌరవంగా నమస్కరించి ప్రక్కనే ఉన్న నులక మంచాన్ని వాల్చి నిల్చున్నాడు. మంచంమీద కూర్చుని తీరిగ్గా కబుర్లుచెప్పే శక్తిలే దిప్పుడు నిరుపమలో. కృతజ్ఞతాసూచకమైన దృక్కులతో అక్కడనుంచి కదలి మరికొంతదూరం నడిచింది. దూరంగా ఇటుకబట్టీలవాళ్ళు పని ముగించుకుని కబుర్లతో కాలక్షేపం చేస్తున్నారు. అప్పుడప్పుడు ఒకటీ రెండుకార్లు ఆ రోడ్డంట వస్తూ పోతూన్నవి. మోటబావి కాలవగట్టుపైన కూర్చుని మళ్లీ ఆలోచనలో మునిగిపోయింది.

తండ్రిలోని నిస్తబ్దత, ఆయన అసంపూర్ణ వైవాహిక జీవితం—ఈ రెండూ ఆమెను పూర్తిగా ఒంటరిదాన్ని చేశాయి. సంఘంలో ఆమె యెడల చూపబడే ఒకానొక అవాంఛనీయమైన చూపు కూడా అందుక్కారణభూతమైంది. అందుకే ఆమె ఆలోచన్లు, పనులు కూడా ఒంటరిగానే ఉండేవి. ఈ విశాల జగతిలో తనకు తానై ఒంటరిగా బ్రతకడమే అలవర్చుకుంది నిరుపమ. ఒకవిధమైన ఉత్కంఠ, ధైర్యమూ ఆమె ఆలోచన వెనుక ఉండి సాహసికమైన జీవితలక్ష్యంవైపు నిరుపమను తీసుకువెళ్తున్నవి. తన జీవితంలో ఏదో లోపించినదనీ ఆ ఖాళీ స్థానాన్ని భర్తీ చేయడం కోసం తను ప్రయత్నించాలని అహరహమూ తాపత్రయ పడేది. వేటగాడి చేతిలో తల్లిని కోల్పోయి, క్షుద్బాధను తనకు తానే తీర్చుకొనవలసిన ప్రయాసతో అసహాయంగా అడవిలో తిరిగే పిల్లజంతువు మాదిరి పరిస్థితే నిరుపమది కూడా.

.... తను చాలామార్లు ఈ ప్రదేశానికి వస్తుంటుంది ఒంటరిగా. ఏవో ఆలోచిస్తూ కూర్చుంటుంది. పరధ్యాన్నంగా తోటమనిషితో మాట్లాడుతుంది. ఆ ఆలోచనలు ఎక్కడా ఏ విషయంపైన కూడా కేంద్రీకరింపబడవు. బుద్ధితెలిసిన నాటినుంచీ తనకదే ప్రపంచం. కాలేజీలో అడుగుపెట్టిననాడు గానీ ఆ తర్వాతగానీ పిల్లల్లో సహజంగా రావలసిన మార్పేమీ తనలో రాలేదు. స్నేహితులు లేరు. స్నేహితురాలు—దేవి తప్ప. తానిప్పుడు ఇరవై సంవత్సరాల యువతి. ఈ యీడు ఆడపిల్లలెవరూ ఒంటరిగా ఈ సమయంలో యిలాంటి ప్రదేశానికి రాదు......

అలా అనుకునేసరికి ఆమెలో ఒక విధమైన గర్వం తొణికింది. సగర్వంగా చుట్టూ కలయజూసింది.

.... తన వాడలో, తన వీధిలో ఇన్ని సంవత్సరాలుగా ఎన్నోసార్లు తిరిగింది. నిత్యం చాలామందిని చూస్తూనే ఉంది. వాళ్ల మాటలు వింటూనే ఉన్నది. తన యిల్లన్నా ఆ పరిసరాలన్నా చాలా యిష్టం. కానీ, తనలో ఎక్కడో ఏ మూలనో అస్పష్టమైన ఆవేదన, సంకోచం, అకారణకోపం ఒక్కొక్కసారిగా మెదుల్తుంటవి. ఎందుకో తనకే తెలియదు. దేనికీ సమాధానం దొరకదు. ఫలితం—తీరని అసంతృప్తి. ఒక్కోసారి మాత్రం ఒక్కగానొక్క సమాధానం ఆమె మెదడులో మెరిసి మాయమయ్యేది. "నా తల్లిగర్భంలో నేను పడటమే కారణం"—యిది సమాధానం ..... యిలా అనుకున్న సమయాల్లో ఆమె కొన్ని రోజులపాటు

ణని రాకపోకలను పూర్తిగా మానేది. చివరకు కాలేజీకి వెళ్లటం కూడా ఆమె భావనలో దోష మయేది. మిగతా రోజుల్లో ఈ తోట వరకూ సాగుతుంది ఆమె నడక. చాలావరకూ కారునే ఉపయోగించుకుంటుంది.

నిరుపమ తనకు తాను ఒంటరిదే అయినా లోకా నికి చిరపరిచితురాలు. డాక్టరు శ్రీనివాసరావుగారి కూతురుగా వ్యవహరింపబడినట్టయితే ఈరోజు వరకూ ఇంత వేదన ఆమెలో ఉండే, అవసరం అవకాశం లేకపోయేవి. కానీ దురదృష్టంవలన ఆమె డాక్టరుగారి 'లేచిపోయిన భార్య కూతురు'—

ఎవరో చెళ్ళున చరిచినట్లయి ఉలికిపడింది నిరుపమ. చుట్టూ కలయజూచి తా నక్కడికివచ్చి చాలాసేపైందని మాత్రం అనుకుంది. మెల్లగా లేచి కాలవగట్టుమీదే నాలుగడుగులు వేసింది. తేమగా ఉండటం మూలాన పచ్చగడ్డి మెత్తగా చల్లగా కాలికి తగిలింది. అక్కడే మళ్ళా కూర్చుని ఈ ప్రపంచపు రొదను విదిలించుకొని తనలోనికి తాను జారిపోయింది.

తన తండ్రి ఏ క్షణానైనా చనిపోవచ్చనే సంగతి సత్యంగానూ, అసత్యంగానూ కన్పించింది. అయినా, భౌతికంగా తననుంచి, తన చూపునుంచి శాశ్వతంగా మాయమవుతాడని మాత్రం ఆమె విశ్వ సించలేక పోతున్నది. తన తండ్రి విషయంలో చావంటే—నిర్వికారమై నిస్తేజమై ఈ లోకపు సుఖదుఃఖాలకు అతీతమై దహన సంస్కారానికి సిద్ధ పరుచబడిన చల్లని మానవాకారం మాత్రం కాదు. ఇలాంటి చావు తన తండ్రికి లేదు. ఆయనెక్క డికో దూర తీరాలకు ప్రయాణమై పోతాడు. అంతే ! తన పసితనంలో ఎప్పుడో తన తల్లి కూడా అలాగే పోయింది—

ఇలాంటి వూహల్తో నిరుపమ తాత్కాలిక మైన సమాధానపడేది. మనసు తేలికయ్యేది. ఈరోజున ఈ సమయంలో కూడా ఆమె అలాగే సముదాయింపబడింది.

.... సమయం వచ్చినప్పుడు తను కూడా ఈ పరిసరాలను వదిలి ప్రస్థానంలో కలిసి ఎక్కడికో

పలుకని స్వరాలు

తెలీని చోటుకు వెళ్తుంది. అందరూ అంతే— ఎవరికీ యిది తప్పదు !

.... మొన్న మొన్నటి వరకూ చిన్నతనం లాగానే తండ్రి అండన, తండ్రి ప్రక్కనే గడిచింది తన జీవితం. కానీ రెండు మూడు సంత్సరాలుగా తనలో ఏదో వ్యక్తిత్వం లాటిది కదలి తన పరిసరాలనూ, తననూ తనకు పరిచయం చేసింది పరిచయంలో స్వాగతంలేదు. మార్దవం అంతకంటే లేదు. కటిక నిజం ! తనకూ తన చుట్టూ ఉన్న మానవ సమా జానికి మధ్యనున్న సంబంధ బాంధవ్యంలో ఆదరణ, ఆప్యాయత యేకోశానా కనిపించవు. ఈ రెండు, మూడు సంవత్సరాలుగా ఈ వూహ రోజురోజుకూ నిర్దారణై వేదనకు మూలమైంది. ఈ కలుషిత వాతావరణంలో పరిశుభ్రమైన చల్లటి గాలిలేక తన ఉనికే దుర్భరమైపోతున్నది—తోటి మాన వుల్లో తన స్థానాన్ని ఎదురుపడి ప్రశ్నించే వాళ్లయితే లేరుగానీ, తన ఎడల ఒకవిధమైన— నిమ్నమైనదే కావచ్చు—దృష్టి ఉందని మాత్రం తాను తెల్సుకోగలిగింది.

...... చిన్నతనంలో తండ్రినీ, తల్లినీ గురించిన అపఖ్యాతి ప్రచారంలో ఉండేది తాను స్వయంగా ఒకటీ, రెండుసార్లు విన్నది కూడా. కానీ అప్పట్లో అదేమిటో తెలుసుకునేపాటి లోకజ్ఞానం లేకపోయింది.

ఒకసారి తండ్రి వూళ్లో లేడు. ఇంటి ఆవర ణకు మూలగా ఒక గది ఉంది. ఆ గది రోడ్డు మీదుగా ఉంటుంది కాబట్టి తనక్కడ ఎప్పుడూ కూర్చునే అలవాటుంది. అలాగే ఆరోజూ కూర్చుంది. ఆ సమయంలో ఎవరో ఇద్దరు మాట్లాడుకుంటూ దారిన వెళ్తున్నారు.

"ఇల్లెవరిదిది. చాలా బాగుంది"—.....

"డాక్టరుగారిది. ఆయన పెళ్ళాం లేచి పోయిందిలే—ఓ అదో కథ"—

"అయితే మళ్లీ పెళ్లి చేసుకున్నాడా."

"లేదు. కానీ, ఆ లేచిపోయినావిడకో కూతురు కలిగింది ఆ అమ్మాయి చాలా బాగుంటుందిలే. పుత్తడిబొమ్మనుకో—"

"ఆ తల్లికి తోడీ కూతురు కాదుగదా ?—"

అంతవరకే విన్నది. ఆతర్వాత ఏమైనా మాట్లాడుకున్నారో లేదో తెలీదు గానీ తను మాత్రం ఆపైన వినదల్చుకోలేదు. విన్పించలేదు కూడా. అప్పటి తనకు పధ్నాలుగేళ్ళు. పరిపూర్ణ జ్ఞానం లేదు. లోకం పోకడను అప్పుడే అర్థం చేసుకుంటున్నది. ఆ తరుణంలో ఈ మాట విన్పించి మనసు విరిగి ప్రపంచానికి దూరంగా మెలుగుతూ వచ్చింది వయసుతోబాటు తా నేదో తప్పు చేశా నన్న భావం కూడా పెరుగుతున్నది. ఆ దోషం ఎలాంటిదో ఏదో తెలియదు......

దూరాన్నుంచి పెద్ద రొద చేసుకుంటూ లారీ వస్తున్నది. లైట్లు కళ్లలో పడేసరికి బాహ్యప్రపంచంలోకి వచ్చింది. ఆకాశం వంక చూచింది అప్రయత్నంగా. నిర్మలంగా ఉండి లేత వెన్నెలను వెదజల్లుతోంది.

తమకూ తమ పరిసరాలకూ మధ్యనున్న ఈ చీలిక, ఈ విభేదం తండ్రీ కూతుళ్లనిద్దరినీ చాలా దగ్గరగా తీసుకు రావల్సింది. కానీ, తా మిద్దరి మధ్యనా ఎప్పుడూ కూడా తండ్రీ కూతుళ్ళ మధ్యనుండే ప్రేమానురాగాలు పుష్పించ లేదు. అయితే నిన్నటి యీ తన తండ్రి అస్వస్థత తామిద్దరినీ కృత్రిమ వాతావరణం నుంచి నిర్మల మైన ప్రేమా, మమతా మమకారాల దగ్గరగా తీసుకొని పోవచ్చు. పైతృక ప్రేమంటే ఏమిటో తెలియని నిరుపమను ఈ ఆలోచన ఒక్కసారిగా కదిలించింది. తండ్రియెడల భక్తిశ్రద్ధలు ఒక్క క్షణంలో మెరిసినవి. ఇన్ని సంవత్సరాలుగా తన ఎడల ఎవరికీ లేని ప్రేమానురాగం తన తండ్రి నుంచి తను పొందబోతున్నది ... ఆమె కళ్ళు రెండూ అశ్రుపూరితములైనవి. ఆ సమయాన మృత్యువు కరుణామూర్తిగా గోచరించిందామెకు. ఇలాంటి మంచిపనులు—శుభప్రదమైన వాటిని— నెరవేర్చడానికే మృత్యువని ఆ నిమిషాన భావించింది నిరుపమ. ఈ మృత్యువు తన, తన తండ్రి జీవి తాల్లో ఇంతకుముందున్న చీకటిని వెళ్లగొట్టి దాని స్థానంలో ఆపేక్ష అనురాగాల్ని నిక్షిప్తం చేస్తుంది.

దూరాన పట్టణ మధ్యంలో దేవుడి గంటలు విన్పించినై— నిరుపమాదేవి తనలో తానే ఏదో మననం చేసుకొన్నదానిలా తల పంకించింది. కనుల నుండి నీరు ధారావాహికంగా వెలువడింది. అది దుఃఖమని చెప్పటానికి వీల్లేదు. సంవత్సరాలుగా తాను పొందలేని వస్తువు ఈనాడు పొంద బోతున్నది. కానీ .... కానీ .... ఎలా ? అంతేనే దుఃఖం.

మరో అయిదు నిమిషాలకు నిరుపమ పూర్తిగా యీ లోకంలోకి వచ్చింది. టైము చూచుకుని మెల్లగా బయల్దేరి వెన్నెల వెలుగులో తడుము కుంటూ తోట మధ్యకు చేరింది. నులకమంచం మీద తోట పనివాడు పడుకుని కూరుపాట్లు పడు తున్నాడు.—వాడి నిద్ర చెడగొట్టి మనస్కరించ లేకనే అన్నది, "లక్ష్మణుడూ ఇంటిదాకా వస్తావా"— అని వాడు త్రుళ్ళిపడి లేచి నిరుపమను పరికించి చూచి "పదండమ్మా యింటివరకూ దిగబెడ





పలుకని స్వరాలు

తాను"—అంటూ కర్ర దీసుకొని బయల్దేరాడు.

త్రోవలో వంతెన ఉంది. క్రిందు వాగు ఎప్పుడూ పారుతూ ఉంటుంది. ఈ సంవత్సరం కొద్దిగా నీరు తగ్గిఉంది. ఆ వంతెనమీదకు వచ్చే సరికి వెంట నొచ్చే మనిషి కొద్ది దూరంలో ఉండటం గమనించింది. వంతెన పైనుంచి చూస్తే దరివెంట నుండే చెట్ల నీడల్లో ప్రవహించే నీరు కన్పించదు. కానీ అది ప్రవహిస్తున్నదని చప్పు డునుబట్టే తెలుసుకోవచ్చు. తండ్రి విషయం ఆలోచిస్తున్న నిరుపమకు అది చూడగానే తండ్రి దయార్ద్రతే జ్ఞాపక మొచ్చింది. ఆయన జీవితం కూడా అలాంటిదే అనుకుంది. వెలుగులోకి రాకుండా ఎప్పుడూ నీడల్లోనే— కన్పించకుండా ప్రవహించే సెలయేరు లాంటిది ఆయన జీవిత మనుకుంది. తండ్రిపై గౌరవం, అభిమానం ఒక్కసారిగా ఉవ్వెత్తున పొంగి పొర్లినవి. మొదటిసారిగా తండ్రిని అత్యున్నతమైన ఆపేక్షతో తల్చుకునేసరికి ఆమె కళ్లలో నీరు నిల్చింది. పితృవాత్సల్యపు చల్లని నీడలో హాయిగా కూర్చున్నట్లనిపించిం దామెకా సమయాన. తన తండ్రి తన దగ్గరే ఉండి ఆడించి లాలిస్తాడని చిన్నతనాన కలలు గన్నది. కానీ, ఈనాడు ఆ కలలు నిజమవుతున్నట్లు అనుభూతి చెందింది. చాలాసేపటివరకూ అలాగే కాలువను చూస్తూ వంతెనపైనే కూర్చున్నది. "ఈనాడే ఈ కలను యదార్థంగా మార్చుకోవాలి" —తలెత్తి చూసేసరికి ఎదురుగా లక్ష్మడు కన్పించాడు. ఇద్దరూ మళ్లా నడక సాగించారు.

* * *

కూతురు సినిమాకని వెళ్లిపోయిం తర్వాత చాలా సేపటి వరకూ వరండాలోనే ఒంటరిగా కూర్చున్నాడు డాక్టరు శ్రీనివాసరావు. ఆరోజు ఆదివారం కాబట్టి డిస్పెన్సరీకి వెళ్లే పనిలేదు. ఇంటికి వచ్చిన ముఖ్యులు వెళ్లిపోయారు. ఇల్లంతా నిశ్శబ్దంగా ఉంది. ఇంటి వెనకాలగా రైలుకట్ట ఉంది. అప్పుడప్పుడు రైళ్ల రొద తప్ప ఆ ఆవరణ లోపలి వరకూ మరే శబ్దమూ వినరాదు. అనాలోచితంగానే లేచి కొద్దిసేపు అటూ యిటూ పచార్లు చేశాడు.

శ్రీనివాసరావు కింతమనిషి ఒక్కోసారి కడిగిన మల్లెపూవులా తెల్లని బట్టల్లో చిరునవ్వు నవ్వుతూ హుషారుగా కన్పిస్తాడు. మరొకప్పుడు నలిగిపోయి మాసిపోయిన బట్టలూ పెరిగిన గడ్డము బరువైన ఆలోచనలతో ఉన్నట్లుగా లోతుకు పోయిన కళ్లతో అసలుకు రెట్టింపు వయసు వాడిలా కన్పిస్తాడు. ఆయనేనాడూ తన ప్రాక్టీసుపైన శ్రద్ధ చూపించలేదు. అదిలేక కూడా నిక్షేపంగా బ్రతకడానికి కావలసిన ఆస్తి వేరే ఉంది. అయినా రోగులు అతనిపైన చాలా గురి పెట్టుకుని ఉంటారు. దగ్గర ఉండి పిల్చుకుపోతే ఆయన వైద్యం అద్భుతం. ఇహ డిస్పెన్సరీ విషయంలో ఆయనకూ ఆయన కాంపౌండర్లకూ లేని శ్రద్ధ రోగులకే ఎక్కువ. ఉదయం—సాయంత్రం—కాస్తంత ఆలస్యం జరిగితే వెంటనే ఎవరో ఒక రోగి తాలూకు మనిషి డాక్టరింటి వరకూ వచ్చి పిల్చుకుపోతాడు. మళ్లీ సాయంత్రం చీకటి పడేవరకూ ఆయనకు • తీరికన్నమాట ఉండదు. ఆయనేనాడు తనకు తానై ఫీజు చెప్పి పుచ్చుకోలేదు. అంతా ఆయన్ను దేముడంటారు. బయటకు వెళ్లింతర్వాత ఆయన జీవితం తాలూకు చర్చ వస్తే కొంతమంది హేళనగా, చాలా కొద్ది మంది జాలిగా అనుకుంటూంటారు.

ఆయన కూడా ఏ విషయంపైనా ఆసక్తితో ఉండడు. చాలావరకు మౌనంగా ఉంటాడు. ఎవరితోనూ ఆప్యాయతగా మాట్లాడడు. కూతురుతో ఆయన నెలసరి మాటల్ని వేళ్లపైన లెక్కించవచ్చు. కన్పించని దానివైపు ఎప్పుడూ తదేకంగా చూస్తున్నట్లుంటాడు. మనిషి ఈమధ్య వేదాంతి కూడా అయినట్లుంది.

"భౌతికమైన యీ నా శరీరం అతి విచిత్రమైంది. ఇన్ని సంవత్సరాలుగా ఇక్కడ దీంట్లో 'నేను'ంటున్నాననే గానీ నేను దాన్నెంత మాత్రం ఉపయోగించుకోలేకపోయాను. ఇప్పుడిది కృశించి పోతున్నది—ఉపయోగపడకుండా. ఈలోపలే మరో జీవిని ఈ కాయం వెతుక్కుంటే ఎంత బావుణ్ను" అనుకునేవాడు ఎన్నోసార్లు.

జీవిస్తైన గాక భౌతిక శరీరంపట్ల ఆయన కమితమైన జాలి, జీవైతే ఈ శరీరాన్ని విడిచి మరో శరీరంలో ప్రవేశిస్తుంది. కానీ, శరీరం అట్లా కాదుగా. దానికి నశింపున్నది. అలా నశించి పోకముందే దాని సార్థక్యాన్ని నెరవేర్చాలి ఇదీ ఆయన మతం. ఇలా అనుకుంటున్నపుడల్లా తనలో తనే నవ్వుకునేవాడు. ఆ నవ్వులో ఉత్సాహం ఉండేది కాదు. వయసుతోపాటు పెరిగి జీర్ణించుకుపోయిన విచారం వెల్లడయేది ఆ నవ్వులో.

'దేవుడు నాకు ఆలోచించటానికి బుద్ధినీ, మాట్లాడటానికి పెదవులున్నూ, నాలుకనూ ఇచ్చాడు. కానీ, మొదటిదే ఎక్కువగా—అతిగా వాడుతూ వచ్చాను. నాకు మాటలు వచ్చీ కూడా మూగవాణ్నయాను—అలా అనిపించుకున్నా నా భార్యతో. నన్నొక జడ పదార్థంగా జమకట్టినపుడు కూడా అన్నపూర్ణను నేనేమీ అనలేదు. కానీ, ఏదో అనాలనీ, నా యీ అచేతన ప్రవర్తనకు సంజాయిషీ చెప్పుకోవాలనీ తద్వారా నిర్దోషిత్వాన్ని నిరూపించుకోవాలనీ ఎంతో అనుకునేవాణ్ని. తీరా గుండెను చీల్చుకునైనా ఒక్క ముక్క కూడా మాట్లాడలేక పోయేవాణ్ణి. ఎన్నాళ్లిలా మూగవాడితో, ప్రాణంలేని కొయ్యతో అది మటుకు కాపురం చేస్తుంది ? అందుకే ...' అన్నపూర్ణను తల్చుకోని రోజు లేదాయనకు

ఇవ్వాళ మళ్లీ అవే ఆలోచన్లు. ఎన్నో సాయంకాలాలు అన్నపూర్ణతో ఆమె ప్రక్కనే మౌనంగా, నిశ్చలంగా శూన్యంలోకి చూస్తూ గడిపాడని! ఎన్నో రాత్రులు ప్రతిసారీ తనను నవ్వించాలనీ తనను మాట్లాడించాలనీ అన్నపూర్ణ శత విధాలా ప్రయత్నించింది. తనూ అందరిలాటివాడే ననీ అందరిమాదిరి తనూ ఉత్సాహంగా తన సహధర్మచారిణితో కాలం గడపగలడనీ ఆశించి అలాగే తనను దిద్దుకోవాలని నానావిధాల తనతో అవస్థ పడింది అయినా తనలో మార్పు రాలేదు. .

అన్నపూర్ణతో వివాహం జరిగిననాడు తా మిద్దరినీ చూచి అంతా ముచ్చటపడ్డారు. పెద్దవాళ్లూ, బంధువర్గంలోని వాళ్లూ—బయటివాళ్లూ అంతా

43 వ పేజీ చూడండి

దీవించారు—కానీ ఈనాడు ..

ఆరోజున డిస్పెన్సరీ నుంచి తిన్నగా ఇంటికి వచ్చాడు శ్రీనివాసరావు అప్పటికి కొత్తగా ప్రాక్టీసు పెట్టిన రోజులు మనిషి ముభావస్తు డైనా మంచివాడని, ఆయన వద్దకు వచ్చేవాళ్ళను కునేవారు ఇంటికి వచ్చి కాస్సేపు విశ్రాంతి తీసుకుని స్నానాదికాలు ముగించుకుని భోజనాని కుపక్రమించాడు అదే సమయంలో యిద్దరమ్మా యిలు వచ్చారనీ, బయట అతని కొరకు వేచి ఉన్నారనీ చెప్పాడు వంటమనిషి భోజనం అయిం తర్వాత వాళ్ళిద్దర్నీ చూశాడు. ఒకమ్మాయిని చూచి 'చాలా బాగుందను' కున్నాడు కానీ విచిత్ర మేమిటంటే దాదాపు ఒక గంట వరకూ వాళ్ళిద్ద రిలో ఎవరూ మాట్లాడలేదు మాటకు తట పటాయిస్తున్నారని తెల్సుకున్నాక యిహ అతనే అడిగాడు 'ఎందు కొచ్చా' రని ఆ రెండో అమ్మాయి ఏదో చెప్పబోయింది పెదవి కదిలింది కానీ మాట విన్పించలేదు గొంతులో మాట గొంతులోనే ఉండిపోయింది అందమైన అమ్మాయికేసి చూశాడు తలవొంచుక్కూర్చుని యే భావమూ తెలియనివ్వింది కాదు అతనికీ విసుగనిపించింది లేచాడు. అప్పుడు గాని ఆ రెండో అమ్మాయి మాట్లాడలేదు !

"డాక్టరుగారూ చాలా ముఖ్యమైన పనుండి వచ్చాము ఎంతో ప్రమాదకరమైంది దయచేసి దీన్ని అతి రహస్యంగా ఉంచాలి"—అని ఆగింది ఆ అమ్మాయి మాటలు వింటుంటే నాటకంలో నటన చేతకాని నటుని సంభాషణ మాదిరిగా తోచిందతనికి కానీ, ఎందుకో అతనికక్కడా వాళ్ళమీద వాళ్ళ తీరు చూచి జాలి కలిగింది వెనువెంటనే ఒక అనుమానం కూడా మొల కెత్తింది తీరా అదే నిజమైంది

అయితే అతన్ని ఏ సహాయం కోరి వచ్చారో ఆ సాయం చేయటానికి అతను సుముఖత చూప లేదు పాపభీతి చేతనో మరెందుచేతనో మరి శ్రీనివాసరావు ఆ సమయంలో అనగలిగిందల్లా— "రెండురోజు లాగి రండ' ని అలా ఎందుకన్నాడో అతనికి జీవితంలో అంతుదొరకని ప్రశ్న ఆ రెండు రోజులూ చాలా ఆలోచించాడు అసలాలోచించ లేదేమో కూడా• ఎందుకంటే అత నేదైనా పని చేస్తే అడ్డగించేవా శ్లెవరూ లేరు అతనాలోచిం చిన దల్లా "ఏం చెయ్యాలి"—అని ఏంచెయ్యాలో అవును—కాదు అనే రెండు మాటల్లో ముగించ వచ్చు ఆ రెంటిలో ఏది ఎన్నుకోవాలో సమస్యగా ఘనీభవించిందా రెండు రోజుల వరకూ— మూడోనాడు, జీవితంలో అత్యంత ప్రాధాన్యత వహించే విషయంపైన లాటరీ వేశాడు— రూపాయిమీది రెండు బొమ్మలూ—పిల్లల 'చిత్తా —చొత్తా' ఆట జ్ఞాపకాని కొచ్చిందా సమ యాన అదే తనూ ఆడాడు సమస్య తీరింది అతనా అమ్మాయిని పెండ్లాడాలి దీనికి సమాధాన పడటం అతనికి తేలికే అనిపించింది "వయసులో ఉన్నది. ప్రకృతిసిద్ధమైన వాంఛను అరికట్టలేక పోయింది ఒకే ఒక్కసారైనా మాతృత్వం వహిం• చక తప్పలేదు కాబట్టి ఆ అమ్మాయి తప్పు తప్పుల్లో• జమకాదు"—ఇది అతని అంతరాత్మకు

పలుకని స్వరాలు

32 వ పేజీ తరువాయి

అతనిచ్చిన సంజాయిషీ అతనిలో పరస్పర విరుద్ధ భావాలు ఎప్పుడూ మొలకెత్తలేదు అందుకే యీ జవాబులో సంతృప్తిపడిందతని మనసు

ఆ తర్వాత వారం రోజులకు అన్నపూర్ణ స్నేహితు రాలి తెలివివల్లనైతేనేమి, శ్రీనివాసరావుతో సంబంధం తమ అదృష్టమని ఆమె తలిదండ్రు లనుకోవడంవల్లనైతేనేమి— ఇద్దరికీ వివాహం జరిగింది దురదృష్టవశాత్తూ అన్నపూర్ణ మొదట శిశువును ఎత్తుకోలేదు పురిటిలోనే పోయిందా శిశువు మరో రెండు సంవత్సరాల సంసారిక జీవి తంలో నిరుపమ పుట్టింది నిరుపమకు నాలు గేళ్ళు వచ్చేసరికి అన్నపూర్ణకు శ్రీనివాసరావుతోటి కాపురం చేయటం గగనమైపోయింది 'ఏడు సంవత్స రాలు ఎలాగో దొర్లినై— కానీ ఒక్క క్షణం ఇకముందు గడవదు'—ఈ ఆలోచనే ఆమెను అతనినుండీ వేరుచేసింది ఆమె పోయి మరెవరితో నైనా ఉందో లేక పోయిపోయి ఎక్కడైనా ఆత్మ హత్యే చేసుకుందో గాని ఒకనాడామె హఠాత్తుగా కన్పించటం మానివేసింది లోకం దృష్టిలో మటుకు 'డాక్టరుగారి భార్య లేచిపోయింది'— వాస్తవంలో అన్నపూర్ణకు శ్రీనివాసరావంటే భక్తి శ్రద్ధలు ఎనలేనివి ఆమె చేసింది లోకానికి చెప్పి చేస్తే ఎంతైనా జాలిని చూరగొనేది. ఆమె బిడ్డకు ఆదరణ లభించేది శ్రీనివాసరావు ఆమె దూరమైందని విచారించాడే గానీ, ఆమె ఈవిధంగా చేస్తే తన గౌరవం తనకు దక్కేదని ఏనాడూ సంకుచితంగా అభిప్రాయపడలేదు.

కిటికీలోనుండి చల్లని గాలి లోపలికి వచ్చి చిరు చెమటలో ఉన్న అతని ఫాలభాగాన్ని తాకింది ఈరోజున శ్రీనివాసరావును పూర్వ స్మృతులు ఆవరించిన యీ సమయంలో అప్పుడప్పుడూ జరు గుతూ వచ్చిన విచిత్రమే ఇప్పుడూ జరిగింది పదిహేనేళ్ళనాటి సంగతులు నెమరువేసుకొంటున్న అతనికి ఎదురుగా నున్న గుమ్మంలోనుంచి తెల్లటి బట్టల్లో తల వెంట్రుకలను చేతితో సవరించు కుంటూ గదిలోకి రావటం కన్పించింది. ఒక క్షణం, వస్తున్నది అన్నపూర్ణా ? లేక నిరుపమా అనే అనుమానం వొచ్చి వళ్ళు ఝల్లుమన్నది. ఠంగారుగా లేచి ఎవరు నువ్వు నిరుపమవా అన్న పూర్ణవా అంటూ ఒక అడుగు వెనక్కు వేసి కుర్చీలో కూలబడ్డాడు. ఇలా అప్పుడప్పుడూ జరుగుతుంటుంది.

పైకి వచ్చే మెట్లపైన అలికిడి అయింది. ఎవరో వొస్తున్నట్లుగా భారమైన అడుగుల సవ్వడి విన్పించింది. అతని గుండె వేగంగా కొట్టు కుంది కుర్చీనిఅంటిపెట్టుకుని కళ్ళుమూసుకున్నాడు.

అదే సమయంలో ఎవరో ఒక మనిషి వచ్చి చీకటిగా ఉండటం మూలాన అగ్గిపుల్ల వెలిగిం చాడు ఎదురుగా కళ్ళుమూసు క్కూర్చున్న డాక్ట రును చూచి విచారం వెలిబుచ్చుతూ స్విచ్చి వేశాడు ఆ కాంతిలో డాక్టరు కంటనీరు స్పష్టంగా కన్పించిం దతనికి

"అయ్యా—ఎవరో వొచ్చారు"—డాక్టరు ఉలిక్కి పడి చూశాడు ఎదురుగా కృష్ణమూర్తిగారు. అతను పూర్తిగా యథాస్థితికి రావటానికి రెండు నిముషాలు పట్టింది. "మూర్తిగారూ భోజనం అయిందా—వదండి, వొస్తున్నాను"—

"తమకోసం ఎవరో వచ్చారండీ,—లైట్లు వెలిగించలేదేం"

"వీరయ్య లేడా"—

లైట్లు వెలిగించడం దగ్గర్నుంచి ఇంటి పనంతా వీరయ్యే చేస్తుంటాడు దౌర్భాగ్యుడు యివాళ రాలేదు

"రాలే దివ్వాళ"—భోజనం చెయ్యకుండానే ఆ వొచ్చిన మనిషితో డాక్టరు బయల్దేరాడు ఆ మనిషేదో చెప్తున్నాడు కానీ, అతని సొద డాక్టరు చెవులలోకి వెళ్లటం లేదు అతని మెదడు ప్రస్తుతాన్ని పరికించ నిరాకరిస్తున్నది ఆలోచన్లు గతంలోకి— అతని వైవాహిక జీవితంవైపు దారితీసినవి. వమీపాత

ఎక్కడో వర్షపుజల్లు పడిందేమో చల్లని గాలి వీస్తున్నది తనతో మరో వ్యక్తి ఉన్నాడనే మాటే మర్చిపోయి కారును చాలా నెమ్మదిగా పోనిస్తూ ఆలోచనల్లో మునిగిపోయాడు గతించిన సంఘటన లన్నీ కలగా పులగంగా వుండి కొంతసేపటికి ఒక చోట ఆగిపై.

ఆరోజు లనూ అన్నపూర్ణా యిద్దరూ కలిసి దగ్గర్లోఉన్న గ్రామానికి ఆహ్వానితులై వెళ్లారు. తనెప్పుడూ ఏ సమయంలో కూడా పెదవి కదిల్చి మాట్లాడి ఎరగడు అన్నపూర్ణ మాత్రం తన వంతూ తన భర్త వంతూ తనే కబుర్లు చెప్పింది. ఎందుకో అవాళ అన్నపూర్ణలో నూతనమైన అందం వెల్లి విరిసిందనిపించింది శ్రీనివాస రావుకు వాళ్లక్కడినుండి బయల్దేరేసరికి రాత్రి దాదాపు పది గంటలు కావొచ్చింది

సగం దూరం వచ్చాక కారాపమని కోరింది అన్నపూర్ణ అతి నాపాడు ఇద్దరూ కారు దిగి రోడ్డు ప్రక్కనే ఉన్న చేను దుక్కిలో కూర్చు న్నారు పండువెన్నెల అకాశం స్వచ్ఛంగా ఉంది ప్రక్కనే ఉన్న భర్త వొడిలో వాలిపోయింది అన్నపూర్ణ ఆ సమయంలో ఏదో చెప్పాలనీ ఆ ఆనందాన్ని ఇద్దరూ పంచుకోవాలనీ వ్యక్తం చేసె ఆమె చూపులు అతని కర్థంకాలేదు అయినా నిరుత్సాహ పడక అన్నపూర్ణ చెప్పింది—తను తల్లి కాబోతున్నట్టు—అతనేమీ అనలేక 'అలాగా' అన్నట్టు మాత్రం చూశాడు ఈ సువార్త విని భర్త ఎంతో సంతోషిస్తాడనీ, ఏదో అంటాడనీ, ఆ సమయంలో తనను గాఢంగా దరిజేర్చుకుంటా



పలుకని స్వరాలు

డనీ—ఏవేవో వూహించిన అన్నపూర్ణ హతాశు రాలైంది అతను మాత్రం నిశ్చలంగా నిర్మాల మైన ఆకాశంకేసి చూస్తుండిపోయాడు

తమ దాంపత్య జీవితానికి ప్రతిరూపంగా—చిహ్నంగా, యిరువురి రక్తాన్నీ పంచుకుని పుట్ట బోయే పాపాయి అతన్ని ఏవిధంగానూ చలింపచేయ జాలకే పోయింది తనెందుకలా ఏ విషయానికైనా రాయిలాగా వుంటాడో అతనికేనాడూ అర్థంకాదు. యిన్ని సంవత్సరాలుగా ఆ పాపాయి పెరిగి పెద్దదై యీనాడు యిరవై సంవత్సరాల యువనవతి అయింది యీనాటికీ తన ప్రవర్తనే అలాగేవుంది ఏనాడూ కూతుర్ని ఆప్యాయంగా దగ్గరకుతీసుకొని 'అమ్మా' అని ముద్దుగా పిల్చి ఎరుగడు కనీసం ఆమె యోగక్షేమాల ఎడ కూడా ఎన్నడూ శ్రద్ధ కనబర్చినట్టులేదు తనిన్నాళ్లు కేవలం యాంత్రికంగా బ్రతికాడు చిన్ననాడు తలిదండ్రులు దుఃఖించారు యవ్వనంలో భార్య నిండైన దాంపత్యసుఖం అనుభవించనోపక కుమిలియేడ్చి ఒకనాడు శలవు తీసుకుంది యీరోజు వరకూ తన వాత్సల్యం బిడ్డపైన ప్రసరింపలేదు .

నడన్ బ్రేకుపడింది అంతలోనే వెనుకనున్న మనిషి దిగడమూ డాక్టరు సీటు తలుపు తెరవడమూ జరిగింది దిగాడు దిగి అతన్ననుసరించాడు వరండాలో చాలామంది చేరివున్నారు లోపలికి వెళ్లాడు మంచంపై ఒకావిడ బాధతో మెలికలు తిరిగి పోతున్నది ఆ సరికి డాక్టరు ఆలోచన్లను పూర్తిగా వొదిలిపెట్టాడు

ఆమెను బాగా పరీక్షించాడు.

"డాక్టరుగారూ ఆపరేషను అవసరమంటారా"—అతనిగొంతులో ఖంగారు— మనిషి బెదిరి పోతు న్నాడు

'అవసరంలేదు'— 'మరేం భయంలేదు కాన్పు సులభంగానే జరుగుతుంది'

ఎదుటిమనిషి కళ్లలో సంతోషం, సంతృప్తి—గర్వం తొంగిచూచినై

వీటిలో యే వొక్కటీ—అలా తనలో ఆనాడు అన్నపూర్ణ ఆసంగతి చెప్పినాడు లేవు ఎందుకు లేవనే ప్రశ్నకు యీనాటి వరకూ సమాధానం దొరక లేదతనికి యికమీదట దొరికినా అది అనవసరం

తెల్లవారుఝాము మూడుగంటలకు కాన్పు సులభంగా జరిగింది ఆమనిషి కృతజ్ఞతతో డాక్ట రుకు నమస్కరించి చేతిలోని అయిదునోట్లు పదిరూపాయిలవి — అందివ్వబోయాడు అతని చేతిని వారిస్తూ డాక్టరు కారెక్కాడు

ఇంటికి బయల్దేరిన డాక్టరుకు కూతురుపైని ఎనలేని ఆపేక్ష వెల్లువై పొంగింది ఈనాటి నుంచీ కంటికి రెప్పలా చూచుకోవా లనుకున్నాడు బిడ్డను ఈరోజు వరకూ తమ యిద్దరి మధ్యనా ఎవరి తప్పూ ఎవరి ప్రమేయం లేకుండానే నిల్చిన అడ్డుగోడల్ని యీ క్షణాన్ని కూల్చివేయాలి.

ఇంతకాలంగా తనలో ఉన్న అనాదరణకూ, అనాసక్తతకూ అశ్రద్ధకూ బిడ్డనే క్షమాపణ కోరుకోవాలి తను క్షమించబడితేనే గానీ తన పాపా నికి నిష్కృతి ఉండదు

"నా తల్లి కాళ్ళపై బడినా దేవుడు నన్ను పాపం నుంచి రక్షించడు" బిడ్డకోసం అతని హృదయం ఆక్రోసించింది అతనిపై అతనికే కోపం, అసహ్యం కలిగాయి—మరుక్షణంలో ఇంట్లో ఉండే బిడ్డను చేతుల్లోకి తీసుకోవాలి 'ఇది భోజ నపు వేళైతే తాను కలిపి తన చేతితో బిడ్డ కన్నం పెట్టవచ్చ' నుకున్నాడు

* * *

ఇంట్లో అడుగు పెట్టేసరికి గడియారం తొమ్మిది గంటలు కొట్టింది తండ్రి గదిలో లైటు వెలుగుతూనే ఉన్నది గుమ్మంలోంచే 'నాన్నా' అనుకుంటూ ముందుకు వెళ్లింది నిరుపమ. ఇరవై సంవత్సరాలుగా ఆమె హృదయంలో ండి పోయిన గౌరవం, అభిమానం చనువులు ఆ పిలు పులో మిళితమై ఉన్నవి కుర్చీవైపు సరికి తండ్రి అక్కడ లేడు. వంట మనిషిని పిల్చింది. కొద్దిసేపటికి అతనొచ్చి చెప్పాడు డాక్టరుగారు అప్పుడే బయటకు వెళ్లారని.

"కృష్ణమూర్తిగారూ, మీరు వెళ్లి పడుకోండి. నాన్న వచ్చాక మే మిద్దరం భోజనం చేస్తాం"—అన్నది మూర్తిగారి కిదేమీ అర్థంకాలేదు అతనీ యింటికి వచ్చి ఇంతకాలం గడిచినా తండ్రీ, కూతుళ్ళు కలిసి భోంచేసినది ఎప్పుడూ చూడ లేదు అందుకే అతను అమితమైన ఆశ్చర్యానికి లోనైనాడు వింతగా కనిపించినప్పటికి లోలోపల చాలా సంతోషించాడు ఇంటి వాతావరణంలో రాబోయే శుభప్రదమైన మార్పును సంతో షంగా ఆహ్వానిస్తున్నాడు మనసులోనే చిరునవ్వు ముఖంతో వెళ్లిపోయాడు

కిటికీలో కూర్చుని తండ్రికోసం చాలాసేపు ఎదురుచూచింది ఎంతవరకూ తండ్రి రాకపోయినా ఆమె ఈనాడు విసుగుచెందలేదు కోపం ఇసుమంతైనా రాలేదు అలాగే నిద్రపోయింది కూడా తెల్లవారు ఝామున చలిగాలి రివ్వున వీచింది. క్రింద కారాగిన చప్పుడుకు త్రుళ్లిపడి నిద్ర మేల్కొంది. రాత్రంతా అలాగే తండ్రికోసం ఎదురుచూస్తూ కిటికీలో నిద్రించినా ఆమెకు కొంచెమైనా కష్ట మనిపించలేదు ఎదురుగా తండ్రిని కలుసుకోవా లని, లేచి మెట్లవరకూ నడిచింది అప్పటివరకున్న తండ్రిని చూడాలనే ఆదుర్దా రెట్టింపై మెట్ల మీదుగా వేగంతో దిగి హాల్లోకి పరుగెత్తింది. దాదాపు అంతగానూ వేగిరపడుతున్న డాక్టరుగారు బిడ్డనుచూచి 'అమ్మా' అని పిలుస్తూ ముందుకొ వచ్చారు కాళ్లయితే నడిచినవిగానీ నోట మాట రాలేదు మరు నిమిషంలో మనిషి ప్రయత్న పూర్వకంగా అతి ప్రయాసతో కాలు నిలద్రొక్కు కుంటున్నట్టుగా కన్పించాడు అప్పటికే అతని చేతుల్లోకి వచ్చి అక్కున చేరుకున్న బిడ్డకు ఆయన బరువనిపించాడు ఆమె తలయెత్తి చూడ బోయినంతలో డాక్టరు కుప్పలా కూలిపోయాడు. ఏదీ యివ్వకుండా మరేమీ పొందకుండానే వెళ్ళి పోయాడు డాక్టరు

మిగిలింది—అతనమితంగా జాలి చూపిన భౌతిక కాయం మాత్రమే. ★